

బ్యాడ్మింటన్ టోర్నీ షురూ
నిర్మల్ పట్టణ శివారులోని కొండాపూర్ వద్ద ఉన్న నిర్మల్ స్పోర్ట్స్ అకాడమీలో గురువారం రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమయ్యాయి. 8లో▸



అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్
షట్టర్ లిఫ్ట్ చేస్తూ చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగలముఠాను పట్టుకున్నట్లు ఎస్పీ జానకీషర్మిల తెలిపారు. పోలీస్ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
32.2 /25.5
వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. అల్పపీడనం, రుతుపవనాల ప్రభావంతో చాలాచోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సర్దుబాటు పారదర్శకంగా నిర్వహించాలి



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న ప్రతినిధులు

నిర్మల్‌టౌన్: ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరారు. జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ అధికారి రామారావుకు గురువారం వినతిపత్రం అందించారు. సర్దుబాటులో మొదట సీనియర్లకు అవకాశం ఇవ్వాలన్నారు. వీరి విల్లింగ్ లేకుంటే జూనియర్‌కు అవకాశం కల్పించాలని తెలిపారు. ఉన్నత పాఠశాలలో ఎఫ్ఏసీ ప్రధానోపాధ్యాయులు పని ఒత్తిడి కారణంగా బోధన సరిగా చేయలేకపోతున్నారన్నారు. వీరిస్థానాల్లో సబ్జెక్టు ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. ఇందులో ఎస్టీయూటీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూమన్నయాదవ్, లక్ష్మణ్, టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోడిశెట్టి రవికాంత్, వహీద్‌ఖాన్, టీపీఆర్టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు భూమన్నయాదవ్

సారంగపూర్: కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పసరిష్కరించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు భూమన్న యాదవ్ కోరారు. మండలంలోని జామ్ గ్రామంలో కేజీబీవీ పాఠశాలలో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం గురువారం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాటాలతోనే ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు మినిమం టైమ్‌స్కేల్ మంజూరు చేయాలని అన్నారు. సమ్మెకాలం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నాణ్యమైన పీఆర్సీ, డీఏ పెండింగ్ బిల్లులు సైతం మంజూరు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పరమేశ్వర్, ముత్తన్న పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీలు యాంటిబయాటిక్స్ ఇవ్వొద్దు



క్లినిక్ సీజ్ చేయిస్తున్న డీఎంహెచ్‌వో రాజేందర్

లక్ష్మణచాంద: జిల్లాలోని ఆర్‌ఎంపీలు యాంటి బయాటిక్స్ రోగులకు ఇవ్వొద్దని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్ ఆదేశించారు. మండలంలోని వడ్యాల్, లక్ష్మణచాంద గ్రామాల్లోని ఆర్‌ఎంపీ క్లినిక్‌లను గురువారం తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా చికిత్సచేస్తున్న శాంతి క్లినిక్, వాణి క్లినిక్, మామడ మండలం పరిమండల్ గ్రామంలోని హారిక క్లీనిక్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. ఆర్‌ఎంపీలు వారి పేరు ముందు డాక్టర్ అని రాయకూడదని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆయన వెంట డాక్టర్ సౌమ్య, బారె రవీందర్ ఉన్నారు.

హెచ్ఐవీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి
నిర్మల్‌చైన్‌గేట్: హెచ్ఐవీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్ అన్నారు. పట్టణంలోని విశ్వనాథ్ పేట్‌లో సమగ్ర ఆరోగ్య పరీక్షల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న హెచ్ఐవీ నిర్ధారణ శిబిరాన్ని గురువారం సందర్శించారు. మీ దగ్గరికి వచ్చే ఆరోగ్య సిబ్బంది వద్ద హెచ్ఐవీ నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలని సూచించారు. ఆదిలాబాద్ నిర్మల్ జిల్లాల క్లస్టర్ మేనేజర్ నాగరాజు, జిల్లా సూపర్‌వైజర్ అనిల్‌కుమార్, బంగల్‌పేట్ అర్బన్ పీహెచ్‌సీ డాక్టర్ మనీషా, నూర్ ఎన్జీవో పీఎం మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

కాంటాలకు స్టాంపింగ్ తప్పనిసరి

భైంసాటౌన్: ఎలక్ట్రానిక్, మాన్యువల్ కాంటాలకు తప్పనిసరిగా స్టాంపింగ్ వేయించాలని తూనికలు, కొలతల శాఖ జిల్లా అధికారి శంకర్ అన్నారు. పట్టణంలోని ఎంఎల్ఎస్ స్టాకిస్ట్ పాయింట్ వద్ద రేషన్ డీలర్లకు చెందిన ఎలక్ట్రానిక్ కాంటాలకు గురువారం స్టాంపింగ్ వేశారు. వినియోగదారులకు తూకాల్లో కచ్చితమైన సేవలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట టెక్నికల్ అసిస్టెంట్ రాజశేఖర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

గ్రంథాలయం.. పఠనోత్సాహం

- విద్యార్థుల్లో అభిరుచి పెంచేలా విద్యాశాఖ చర్యలు
- పాఠశాలల్లో గ్రంథాలయాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి
- ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు నిర్వహణలో శిక్షణ..



కొరటికల్ ప్రాథమిక పాఠశాల లైబ్రరీలో విద్యార్థులతో ఉపాధ్యాయులు(ఫైల్)

ప్రాముఖ్యత..
- పఠన సామర్థ్యం: విద్యార్థులు వ్యక్తిగతంగా, బృందంగా పఠన అలవాటును అభివృద్ధి చేసుకుంటారు.
- వైజ్ఞానిక జిజ్ఞాస: రంగురంగుల పోస్టర్లు, కథలు, వైజ్ఞానిక పుస్తకాలు జిజ్ఞాసను రేకెత్తిస్తాయి.
- సమాజ భాగస్వామ్యం: గ్రంథాలయ క్లబ్‌ల ద్వారా తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం పెరుగుతుంది.

నిర్మల్‌ఖిల్లా: రాష్ట్ర ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ విద్యార్థుల్లో పఠనాభిరుచి పెంపొందించే లక్ష్యంతో గ్రంథాలయాలను బలోపేతం చేస్తున్నాయి. జిల్లాలోని 756 పాఠశాలల్లో 'రీడింగ్ కార్నర్'ల పేరిట గ్రంథాలయాలు రూమ్ టు రీడ్ సంస్థ సహకారంతో ఏర్పాటు చేశారు. వీటిలో కథలు, బొమ్మలు, వైజ్ఞానిక పుస్తకాలను అందుబాటులో ఉంచారు. రోజువారీ బోధనలో గ్రంథాలయ పీరియడ్‌ను చేర్చారు. రోజుకు ఒక పీరియడ్ గ్రంథాలయ సమయంగా కేటాయించడం ద్వారా విద్యార్థులు చదవడం అలవాటు చేసుకుంటున్నారు. ఈ పుస్తకాలు జిజ్ఞాస, మేధోశక్తి, భాషా సామర్థ్యాలను పెంచుతున్నాయి.

ఉపాధ్యాయులకు శిక్షణ..
గ్రంథాలయ నిర్వహణ, పఠన అభిరుచి పెంపొందించేందుకు హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో ఈ నెల 17 నుంచి 19 వరకు మూడు రోజులు ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. జిల్లా నుంచి ఏ.గోపాల్ (పెంబ్‌పల్లి), ఎం.ఎల్లన్న (వానల్‌పాడ్) ఈ శిక్షణకు వెళ్లారు. వారు జిల్లాకు వచ్చి స్థానిక ఉపాధ్యాయులకు తిరిగి శిక్షణ ఇవ్వనున్నారు.



రాష్ట్రస్థాయి శిక్షణలో పాల్గొంటున్న జిల్లా ఉపాధ్యాయులు (కుడివైపు ఇద్దరు)

అభిరుచి అలవాటుగా మారేలా..



చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో పఠనాభిలాష వృద్ధి చెందితే, అదికాస్త అలవాటుగా మారుతుంది. తద్వారా విద్యార్థుల భవిష్యత్తు పురోగమనం ఉజ్వలంగా ఉంటుంది. ఇందుకోసం గ్రంథాలయ ప్రాధాన్యతపై పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లాలోని ఉపాధ్యాయులు కూడా తమ పాఠశాలల్లో గ్రంథాలయ పీరియడ్ ఉండేలా చూస్తున్నారు.
– పి.రామారావు, డీఈవో

స్వర్ణ ప్రాజెక్టు ఆధునికీకరణకు కృషి

- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



స్వర్ణ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదలచేస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

సారంగపూర్: స్వర్ణ ప్రాజెక్టు ఆధునికీకరణకు తన వంతు కృషి చేస్తానని, ఆయకట్టు రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తానని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. స్వర్ణ ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు గురువారం సాగునీరు విడుదల చేశారు. అనంతరం ప్రాజెక్టు ఆనకట్టపై రూ.32 లక్షలతో ఏర్పాటు చేసే లైటింగ్ పనులను ప్రారంభించారు. అక్కడి నుంచి నేరుగా సారంగాపూర్‌కు చేరుకుని స్వర్ణ ప్రాజెక్టు మధ్యకాలువ(జౌళినాళ)పై 46 లక్షలతో క్రాస్ రెగ్యులేటరీ, ఎస్కేప్ రెగ్యులేటరీ పునర్నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ స్వర్ణ ప్రాజెక్టు ఆయకట్టు గతంలో 10 వేల ఎకరాలు కాగా, ప్రస్తుతం కాలువలు సరిగా లేక, నిర్వాహణ లోపంతో విస్తీర్ణం గణనీయంగా తగ్గిందన్నారు. ప్రాజెక్టు ఆధునికీకరణకు నిధులు సమీకరిస్తానని తెలిపారు. వర్షాలు ఆలస్యం అయిన నేపథ్యంలో నారుమడుల కోసం నీటిని విడుల చేశామన్నారు. రైతులు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ డీఈ శ్రీనివాస్, పంచాయతీరాజ్ డీఈ తుక్కారాం, స్థానిక తహశీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రావు, ఏఈలు మధుపాల్, వేణుగోపాల్, మండల నాయకులు కాల్వ నరేశ్, తిరుమలచారి, విలాస్, గంగారెడ్డి, రాజేశ్వర్, నారాయణ, మోహన్, భీమలింగం, సామల వీరయ్య, చంద్రప్రకాశ్‌గౌడ్, రాజారెడ్డి, ఆయా గ్రామాల కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యం కోసమే హెల్త్ సబ్‌సెంటర్లు
సారంగపూర్: ప్రజల రోగ్యం, వారి మెరుగైన జీవన విధానం కోసమే ఆరోగ్య ఉపకేంద్రాలను నిర్మిస్తున్నామని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని స్వర్ణ, కౌట్ల(బి), మలక్ చించోలి, జామ్, ధని, గ్రామాల్లో ఒక్కోటి రూ.20 లక్షలతో నిర్మించనున్న ఆరోగ్య ఉపకేంద్రాలకు భూమిపూజ చేశారు. ధని గ్రామం నుంచి రాజరాజేశ్వర తండా వరకు రూ.1.60 లక్షలతో నిర్మించనున్న బీటీరోడ్డుకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పీఆర్ డీఈ తుక్కారాం, ఏఈ దేవీదాస్, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్, స్థానిక వైద్యాధికారి డాక్టర్ అబ్దుల్ జవాద్, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రావు, ఎంపీవో అజీజ్‌ఖాన్, నాయకులు రావుల రాంనాథ్, మోహన్, భీమలింగం, సామల వీరయ్య, తిరుమలాచారి, విలాస్ కాల్వ నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరుశాతం పెంచాలి

- ఇంటర్ బోర్డు రాష్ట్ర పరిశీలకులు వెంకటేశ్వర్లు



అధ్యాపకులతో మాట్లాడుతున్న ఇంటర్ బోర్డు రాష్ట్ర పరిశీలకులు వెంకటేశ్వర్లు

లోకేశ్వరం/తానూరు: ఇంటర్‌లో మెరుగైన ఫలితాలు సాధించాలని ఇంటర్ బోర్డు రాష్ట్ర పరిశీలకులు వెంకటేశ్వర్లు అన్నారు. లోకేశ్వరం, తానూర్, ముధోల్ జూనియర్ కళాశాలలను గురువారం తనిఖీ చేశారు. అధ్యాపకులతో మాట్లాడారు. అడ్మిషన్లు పెంచాలన్నారు. విద్యార్థులు తరగతులకు హాజరయ్యేలా చూడాలన్నారు. పోషకులతో సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థులకు క్రమం తప్పకుండా కళాశాలకు హాజరయ్యేలా అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు ఐఐటీ, జేఈఈ, నీట్ వాటిలో ర్యాంకులు సాధించేలా చూడాలన్నారు. విద్యార్థుల అపార్ నంబర్లను జనరేట్ చేయాలన్నారు. విద్యార్థులకు, అధ్యాపకులకు ఫేస్ రికగ్నేషన్ యాప్ అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. అధ్యాపకులు సమయపాలన పాటించాలని సూచించారు. తానూరులో ప్రస్తుతం కొనసాగుతున్న భవనంలో ప్రయోగశాల లేదని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన ఈ విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరిచేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట డీఐఈవో పరశురాం, లోకేశ్వరం కళాశాల ప్రిన్సిపాల్ గౌతం. ముధోల్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అబ్దుల్ రెహమాన్, అధ్యాపకులు గంగాధర్, ప్రశాంత్, గణేశ్ ఉన్నారు.

ఉపాధ్యాయులకు అటల్ టింకరింగ్ ల్యాబ్ ట్రైనింగ్

నిర్మల్‌టౌన్: ఈనెల 18, 19 తేదీల్లో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు అటల్ టింకరింగ్ ల్యాబ్ ట్రైనింగ్ ఇవ్వనున్నట్లు డీఈవో రామారావు గురువారం తెలిపారు. ఈ ట్రైనింగ్ రెండు సెంటర్లలో ఉంటుందని పేర్కొన్నారు. నిర్మల్ డివిజన్ ఉపాధ్యాయులకు జుమ్మారత్‌పేట్ ప్రభుత్వ పాఠశాలలో, భైంసా డివిజన్ ఉపాధ్యాయులకు దేగాం జెడ్పీహెచ్ఎస్‌లో శాలలో ట్రైనింగ్ ఉంటుందని వివరించారు. ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ట్రైనింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ప్రతీ పాఠశాల నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు హాజరు కావాలని సూచించారు.

ఆర్జీయూకేటీలో ముగిసిన ఓఎల్ఐ, ఎంఎల్బీఏ శిక్షణ



సర్టిఫికెట్స్ ప్రదానం చేస్తున్న ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్

బాసర: బాసరలోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్(ఆర్జీయూకేటీ)లో ప్రఖ్యాత వార్టన్ బిజినెస్ స్కూల్, యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియాతో కలిసి నిర్వహించిన ''ఆర్గనైజేషనల్ లీడర్‌షిప్ అండ్ ఇన్నోవేషన్ (ఓఎల్ఐ), మెషిన్ లెర్నింగ్ అండ్ బిజినెస్ అనలిటిక్స్ (ఎంఎల్బీఏ)'' కోర్సు విజయవంతంగా ముగిసింది. కార్యక్రమం విద్యార్థులకు నాయకత్వ నైపుణ్యాలు, సాంకేతిక జ్ఞానం, డేటా ఆధారిత నిర్ణయాధికారాన్ని అందించడంలో కీలక పాత్ర పోషించింది. 14 రోజుల ఈఇంటెన్సివ్ కోర్సు విద్యార్థులకు ఆర్గనైజేషనల్ లీడర్‌షిప్, ఎథిక్స్, స్ట్రాటజిక్ మార్కెటింగ్, మెషీన్ లర్నింగ్ మోడల్స్, బిజినెస్ అనలిటిక్స్ ఫ్రేమ్‌వర్క్‌లో శిక్షణను అందించింది. థియరీతోపాటు, రియల్-టైమ్ కేస్ స్టడీస్, సిమ్యులేషన్‌ల ద్వారా విద్యార్థులలో ఆచరణాత్మక అంతర్‌దృష్టిని పెంపొందించేలా ఈ కార్యక్రమం రూపొందించబడింది. ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్, ఓఎస్డీ మురళీధరన్, కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్‌లు అందించారు.

సమన్వయంతో సమస్యలు పరిష్కారం

- కలెక్టర్ అభిలాష అభినవ్



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా అభివృద్ధిలో కీలక అంశాలపై శాఖల మధ్య సమన్వయం అవసరమని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. కలెక్టరేట్‌లో మాదకద్రవ్యాల నిర్మూలన, బాల్యవివాహాల నివారణ, నకిలీ విత్తనాల అమ్మకాలు, స్కానింగ్ కేంద్రాల తనిఖీలు, రోడ్డు భద్రత తదితర అంశాలపై అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. విత్తన దుకాణాల్లో నిరంతరం తనిఖీలు చేయాలన్నారు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా ఇప్పటివరకు 32 మంది బాల కార్మికులను గుర్తించి, 19 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. బాల్యవివాహాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ ఏడాది 12 బాల్య వివాహాలను అడ్డుకున్నట్లు తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్యవివాహాలపై అవగాహన కల్పించామన్నారు. పీసీ–పీఎన్‌డీటీ చట్టం ప్రకారం లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే కేంద్రాలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ చట్టం అమలులో ఇప్పటివరకు 51 కేసులు నమోదవగా, 39 కేసుల్లో పరిహారం చెల్లించామని, 12 కేసులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. మాదక ద్రవ్యాల రహిత జిల్లా లక్ష్యంగా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు 73 కేసులు నమోదు కాగా, 145 మంది అరెస్టయ్యారని, 525 కేజీల 305 గ్రాముల గంజా సీజ్ చేశామన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్‌హెచ్ఏఐ, ఆర్‌అండ్‌బీ శాఖల ద్వారా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలన్నారు. కడ్తాల్, సోన్ గ్రామస్తులు, ఇతర గ్రామాల పరిధిలోని నేషనల్ హైవే రూట్లపై ప్రమాదాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో భిక్షాటన నిర్మూలన, ట్రాఫిక్ సమస్యలపై చర్యలు తీసుకోవాలన్నారు.

సంక్షేమ, పోలీసు శాఖల మధ్య సమన్వయం..
ఎస్పీ జానకీషర్మిల మాట్లాడుతూ, బాల్యవివాహాల నియంత్రణలో సంక్షేమ, పోలీసు శాఖల మధ్య సమన్వయం కొనసాగుతుందన్నారు. చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల నియంత్రణకు తనిఖీలు పెంచామన్నారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాధిక, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, అడిషనల్ ఎస్పీ ఉపేంద్రారెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు కేజీబీవీలకు పాఠ్యపుస్తకాలు

- విద్యాసంవత్సరం ప్రారంభమైన నెల తర్వాత చేరిక..
- 30 రోజులు ఇబ్బందిపడ్డ విద్యార్థులు



లక్ష్మణచాంద: పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన బాలికలు ఆర్థిక సమస్యలతో చదువు మధ్యలో ఆపివేయకుండా నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయాల (కేజీబీవీ)ను స్థాపించింది. ఈ విద్యాలయాలు ఇంటర్మీడియెట్ స్థాయికి అప్‌గ్రేడ్ అయ్యాయి. బాలికలకు వసతి సౌకర్యంతో కూడిన విద్యను అందిస్తున్నాయి. అయితే, 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠ్య పుస్తకాలు నెల తర్వాత ఎట్టకేలకు జిల్లాకు వచ్చాయి. ఈ ఆలస్యంతో విద్యార్థినులు ఇబ్బంది పడ్డారు.

జిల్లాలో 18 కేజీబీవీలు..
జిల్లాలో 18 కేజీబీవీ సంస్థలు ఉన్నాయి. వీటిలో 15 కళాశాలలుగా అప్‌గ్రేడ్ అయ్యాయి. ఈ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 1,200 మంది, ద్వితీయ సంవత్సరంలో 880 మంది చదువుతున్నారు. 2025–26 విద్యా సంవత్సరంలో కేజీబీవీలు జూన్ 12న ప్రారంభమయ్యాయి. పాఠశాలలో మొదటిరోజు పాఠ్యపుస్తకాలు అందిస్తామని ప్రభుత్వం తెలిపింది. కానీ, నెల రోజులు దాటిన తర్వా పుస్తకాలు వచ్చాయి. దీంతో కొందరు విద్యార్థినులు సీనియర్ విద్యార్థుల నుంచి పాత పాఠ్యపుస్తకాలు సేకరించి చదువుకోగలిగారు, సీనియర్లతో సంబంధం లేని విద్యార్థినులు ఇబ్బంది పడ్డారు. రెండు రోజుల క్రితం పాఠ్యపుస్తకాలు రావడం విద్యార్థులకు ఊరట కలిగించింది.

నెల రోజులు ఇబ్బంది..



జూన్ 12న కళాశాలలు ప్రారంభమయ్యాయి. గతంలో ప్రారంభం అయినరోజే పాఠ్య పుస్తకాలు అందేది. ఈసారి సకాలంలో పాఠ్య పుస్తకాలు అందకపోవడంతో నెలరోజులు పాఠ్యపుస్తకాలు లేకుండానే తరగతులు నిర్వహించారు. పాఠాలు సక్రమంగా అర్థం కాక ఇబ్బంది పడ్డాం.
– భవ్య ఇంటర్ విద్యార్థి కేజీబీవీ

సకాలంలో అందిస్తే మేలు



జిల్లాలోని కేజీబీవీ కళాశాలలో చేరిన విద్యార్థులకు కళాశాలలు పునః ప్రారంభమైన వెంటనే పాఠ్య పుస్తకాలు సరఫరా చేసేలా ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలి. లేదంటే నష్టపోయే అవకాశం ఉంది. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతాధికారులు రానున్న కాలంలో సమస్య రాకుండా చూసుకోవాలి.
– లక్ష్మి, ఇంటర్ విద్యార్థి కేజీబీవీ

మేకలకు అంతుచిక్కని రోగం

- గుట్ట ప్రాంత గ్రామాల్లో ఎక్కువ
- ఇలేగాంలో 17 మేకలు మృతి
- చికిత్స అందేవరకు బతకడం లేదు..

ఈ ఫొటోలో చనిపోయిన మేకలను చూపుతున్న రైతు పేరు కదం దత్తురాం. ఇలేగాం గ్రామానికి చెందిన దత్తురాంకు మేకల పెంపకమే జీవనాధారం. 80 మేకలు మేపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గ్రామాన్ని ఆనుకుని ఉన్న గుట్ట ప్రాంతంలో మేకలను మేపుతున్నాడు. ఇటీవల మేకలను మేపి సాయంత్రం ఇంటికి తీసుకొచ్చాడు. ఉదయం లేచి చూసేసరికి పది మేకలు మరణించాయి. కొన్ని మేకలు జలుబు చేసినట్లు బాధపడుతుండడంతో పశువైద్యులకు సమాచారం అందించాడు. చికిత్స చేయించినా రోగం నయం కాక మరో ఏడు మేకలు మరణించాయి. మరణించిన మేకల విలువ రూ.2.50 లక్షలు ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశాడు.



ఇలేగాంలో వింత రోగంతో మృతిచెందిన మేకలు

లోకేశ్వరం : జిల్లాలో మేకలు వింత రోగంతో మరణిస్తుండటం యజమానులను ఆందోళనకు గురిచేస్తోంది. ముఖ్యంగా, సీసీపీపీ(కంటైజెస్ క్యాప్రిన్ ప్లూరో నిమోనియా) వ్యాధి కారణంగా భైంసా మండలం ఇలేగాం గ్రామంలో 17 మేకలు మరణించాయి. ఈ సమస్యపై అధికారుల నిర్లక్ష్యం యజమానులలో అసంతృప్తిని పెంచుతోంది. సీసీపీపీ (కంటైజెస్ క్యాప్రిన్ ప్లూరో నిమోనియా) అనేది మైకోప్లాస్మా క్యాప్రీ వైరస్ వల్ల సంక్రమించే ఒక అంటు వ్యాధి. ఈ వ్యాధి సోకిన మేకలలో 50% మాత్రమే బతికే అవకాశం ఉందని భైంసా పశువైద్యాధికారి విఠల్ తెలిపారు. జిల్లాలో ఈ వ్యాధి వేగంగా వ్యాప్తి చెందుతుంది. సరైన నివారణ చర్యలు లేకపోతే పశుసంపదకు తీవ్ర నష్టం కలిగిస్తుంది. ఇటీవల ఇలేగాం గ్రామంలో 17 మేకలు ఈ వ్యాధి బారిన పడి మరణించాయి.

యజమానుల ఆందోళనలు
జిల్లాలోని వివిధ గ్రామాల్లో రెండు రోజులుగా మేకలు సీసీపీపీ వ్యాధితో మరణిస్తున్నాయి. సాయంత్రం మేతకు వెళ్లి వచ్చిన మేకలు ఉదయానికి మరణిస్తుండటం యజమానులను ఆందోళనకు గురిచేస్తోంది. జిల్లా అధికారులు ఈ సమస్యపై తగిన శ్రద్ధ చూపకపోవడంతో యజమానులు నిరాశతో ఉన్నారు.

సీసీపీపీ వ్యాధి లక్షణాలు
- 106 డిగ్రీల వరకు జ్వరం, మూలుగుతూ ఉంటాయి.
- ఉబ్బసం వల్ల ఊపిరి పీల్చుకోవడంలో ఇబ్బంది ఉంటుంది.
- ముక్కు నుంచి చీమిడి, కళ్ల నుంచి నీరు కారుతుంది.
- నిరంతరం పొడి దగ్గు ఉంటుంది.
- మేకను వెనక కాళ్లు పట్టి పైకి లేపి, తలను క్రిందికి వంచితే ముక్కు నుంచి నీటిలాంటి స్రావం కనిపిస్తుంది.

చికిత్స, నివారణ చర్యలు
- తగిన మోతాదులో యాంటీబయాటిక్ మందులు వాడాలి.
- టైలోసిన్ ఇంజెక్షన్‌ను ఏడు రోజులు ఇవ్వాలి.
- పశువైద్యుల సలహా మేరకు మందులు వాడాలి.
- మేకల పాకలను పరిశుభ్రంగా ఉంచడం, గాలి, వెలుతురు ఉండేలా చూడాలి.
- గుంపుగా మేకలు ఉండకుండా చూడాలి.
- ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసిన మేకలను వేరుగా ఉంచాలి.
- వ్యాధి సోకిన మేకలను మంద నుంచి వేరుచేయాలి.

నివారణ చర్యలే మార్గం



మేకలకు ప్రస్తుతం వస్తున్న రోగం నుంచి కాపాడుకునేందుకు ముందస్తుగా చర్యలు నివారణే మార్గం. ప్రతీ నాలుగు నెలలకోసారి మేకలకు, గొర్రెలకు నట్టల నివారణ మందు తాగించాలి. ఒక మంద నుంచి మరోక మందకు మార్చడం, ఇతర ప్రాంతల నుంచి తిసుకు వచ్చిన మేకలకు ముందుగా వ్యాధి ఉంటే వాటిని వేరుగా ఉంచాలి. ఇలెగాంలో మరణించిన మేకలకు పోస్టుమార్టం నిర్వహించి ఉన్నతాధికారులకు శాంపిల్స్ పంపించాం. ఆ రిపోర్టు ఆధారంగా నివారణ చర్యలు చేపడతాం.
– విఠల్, భైంసా పశువైద్యుడు

వ్యాధి సోకితే 1962కు డయల్ చేయండి



జిల్లాలోని పశువులకు గొర్రెలకు, మేకలకు ఎలాంటి వ్యాధిలు సోకినా వెంటనే 1962 నంబరుకు డయల్ చేయాలి. 1962 అంబులెన్సు సిబ్బంది గ్రామాలకు చేరుకుని పశువులకు, మేకలకు, గొర్రెలకు చికిత్స అందిస్తారు. తగిన మందులు అందజేస్తారు. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే వైద్య నిపుణులకు సమాచారం అందించి మెరుగైన చికిత్సను అందిస్తారు. పశువైద్యుల సలహాలు సూచనల మేరకు చికిత్స చేయించుకోవాలి. ఇలెగాంలో మేకల మరణాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం.
– బాలిగ్ అహ్మద్, జిల్లా పశువైద్యాధికారి

క్లుప్తంగా

108లో సుఖప్రసవం



శిశువుతో అంబులెన్స్ సిబ్బంది

కోటపల్లి: మండలంలోని పంగిడిసోమారం గ్రామానికి చెందిన గర్భిణి రెడ్డి లవలోకకు పురిటినొప్పులు రావడంతో ఆమె భర్త అర్జున్న 108కి సమాచారం అందించాడు. సంఘటన స్థలానికి చేరుకున్న సిబ్బంది అంబులెన్సులో కోటపల్లి ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో పురిటినొప్పులు అధికం కావడంతో పంగిడిసోమారం అటవీప్రాంతంలోనే సుఖప్రసవం చేయడంతో పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. ఇరువురిని కోటపల్లి పీహెచ్‌సీకి తరలించారు. కార్యక్రమంలో ఈఎంటీ షబనాజ్, పైలట్ ఫరీద్, తదితరులు పాల్గొన్నారు.

చోరీకి పాల్పడిన నిందితుడి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని రాణిసతీజీ కాలనీలో ఉన్న ఐఎఫ్‌సీ ఫుడ్‌కోర్టులో ఈనెల 15న రాత్రి జరిగిన చోరీలో నిందితుడిని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. దుకాణంలోంచి రూ.వెయ్యి నగదుతో పాటు ఓ సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లారని షాపు యజమాని వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు.

సిమ్స్‌లో సింగరేణికి 7 సీట్లు

శ్రీరాంపూర్: రామగుండంలోని సిమ్స్ (సింగరేణి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్)లో కంపెనీ కోటా కింద 7 ఎంబీబీఎస్ సీట్లు కేటాయించినట్లు శ్రీరాంపూర్ డీజీఎం(పర్సనల్) ఎస్.అనిల్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ఉద్యోగులు, అధికారుల పిల్లలకు ఈ సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు జీఎం కార్యాలయంలోని పర్సనల్ డిపార్టుమెంట్ నందు సంప్రదించాలని ఆయన సూచించారు.

సింగరేణిలో ఆర్టీఐకి అడ్డంకులు

- సమాచార అధికారుల నియామకంలో జాప్యం
- నిలిచిన దరఖాస్తుల స్వీకరణ



శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం

శ్రీరాంపూర్: సింగరేణి శ్రీరాంపూర్ ఏరియాలో ఆర్టీఐ దరఖాస్తులకు అడ్డంకి ఏర్పడింది. కంపెనీలోనే అతిపెద్ద ఏరియా అయిన శ్రీరాంపూర్‌లో అధికారులు సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ యాక్ట్ -2005) దరఖాస్తులు స్వీకరించడం లేదు. మూడు నెలలుగా ఈ ప్రక్రియ నిలిచిపోవడంతో సమాచారం కోరే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏరియా పరిధిలో ఈ చట్టం కింద దరఖాస్తులు స్వీకరించాల్సిన పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ (పీఐవో), అసిస్టెంట్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ (ఏపీఐవో) లేకపోవడంతో ఈ సమస్య ఉత్పన్నమైంది. పీఐవోగా బాధ్యతలు స్వీకరించిన ఓ డీజీఎం అధికారి ఏప్రిల్ 15న అనారోగ్య కారణాలతో మృతి చెందాడు. ఆయన స్థానంలో ఎవర్నీ నియమించలేదు. ఆతర్వాత ఏపీఐవోగా బాధ్యతలు నిర్వహించిన అధికారి కూడా గత నెల ఇక్కడి నుంచి ఇతర ఏరియాకు బదిలీ అయ్యాడు. ఆ స్థానాన్ని కూడా భర్తీ చేయలేదు. దీంతో ఈ రెండు సీట్లు ఖాళీగానే ఉంటున్నాయి. పీఐవో బాధ్యతలు నిర్వహించే అధికారి మృతి చెందిన తరువాత మరో పూర్తిస్థాయి అధికారిని నియమించే వరకు ఏపీఐవోకు ఇన్‌చార్జి పీఐవో బాధ్యతలు అప్పగించడానికి అనుమతి కోరుతూ ఏరియా అధికారులు కార్పొరేట్ అధికారులకు లేఖ రాశారు. వారు ఆలస్యంగా స్పందించడంతో అలోపే సదరు ఏపీఐవో అధికారి కూడా ఇక్కడి నుంచి వేరే ఏరియాకు బదిలీ అయ్యారు. దీంతో ఈ రెండు బాధ్యతలను చూసేవారు కరువయ్యారు.

వెనుదిరిగి పోతున్న దరఖాస్తుదారులు

సమాచారం హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకోవడానికి జీఎం కార్యాలయానికి వచ్చిన కార్మికులు, సమాచార చట్టం కార్యకర్తలు, పౌర సమాజ కార్యకర్తలు అక్కడ అధికారులెవ్వరూ దరఖాస్తులు స్వీకరించకపోవడంతో వెనుదిరిగి పోతున్నారు. ఆ స్థానాల్లో అధికారులు వచ్చేంత వరకు తమకు ఈ దరఖాస్తులు స్వీకరించే అధికారం లేదని ఇతర అధికారులు వారికి చెప్పి తిప్పి పంపిస్తున్నారు. దీనికి తోడు ఇది వరకే పీఐవోకు దరఖాస్తు చేసుకున్నాక సరైన సమాచారం, స్పందన లేకపోవడంతో అప్పిలేట్ అధికారిగా ఉన్న ఏరియా జీఎంకు దరఖాస్తులు చేసుకున్న వారూ ఉన్నారు. ఆ దరఖాస్తులపై కూడా నిర్ణయం తీసుకోవాలంటే కూడా పీఐవో వద్ద సమాచారం తీసుకోవాల్సి ఉంటుంది. పీఐవో లేకపోవడంతో అప్పిలేట్ దరఖాస్తులు కూడా పరిష్కారానికి నోచుకోకుండా మరుగునపడ్డాయి. కార్పొరేట్ అధికారుల జాప్యం వల్లే ఈ పరిస్థితి ఏర్పడినట్లు తెలిసింది. చట్టబద్ధత గల ఇలాంటి పోస్టుల భర్తీలో జాప్యం చేయడం సరికాదని, ఇలా చట్టాలను నీరుగార్చుతున్నారని దరఖాస్తు దారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై రాష్ట్ర సమాచార హక్కు చట్టం పరిరక్షణ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

కార్పొరేట్‌కు లేఖ రాశాం..

పీఐవో, ఏపీఐవో పోస్టులు భర్తీ చేయడం కోసం కార్పొరేట్ అధికారులకు లేఖ రాశాం. కార్పొరేట్ అధికారుల ఆదేశాల మేరకే ఈ నియామకాలు జరుగుతాయి. త్వరలోనే ఈ సమస్యను పరిష్కరిస్తాం.

– ఎం.శ్రీనివాస్, జీఎం, శ్రీరాంపూర్

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ షురూ



బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు

నిర్మల్‌టౌన్: నిర్మల్ పట్టణ శివారులోని కొండాపూర్ వద్ద ఉన్న నిర్మల్ స్పోర్ట్స్ అకాడమీలో గురువారం రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమయ్యాయి. మంచిర్యాల జిల్లా స్టార్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా 33జిల్లాల నుంచి 180మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. గురువారం క్వాలిఫై పోటీలు నిర్వహించగా.. శుక్రవారం నుంచి ఈ నెల 20వరకు ప్రధాన పోటీలు కొనసాగుతాయి. అండర్–19 బాలురు, బాలికలు, సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారు. జిల్లా క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, మంచిర్యాల జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముఖేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పుల్లూరి సుధాకర్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్ కిషోర్, కో కన్వీనర్, వన్నెల భూమన్న, కోఆర్డినేటర్లు సందీప్, మధుకర్‌గౌడ్, మహేష్, ప్రణీత్, నందకుమార్ పోటీలను పర్యవేక్షించనున్నారు. శుక్రవారం మెయిన్ డ్రా పోటీలకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఆదిలాబాద్ ఎంపీ గోడెం నగేష్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరు కానున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని ఆశ్రమ ప్రాథమిక పాఠశాలల్లో సీఆర్‌టీ(ఎస్‌జీటీ)ల భర్తీకి అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీటీడీవో రమాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 18 నుంచి 23లోగా గిరిజన సంక్షేమ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని సూచించారు. స్థానిక గిరిజన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని, డీఈడీ పాసై, టెట్ అర్హత సాధించి ఉండాలన్నారు. ఈ నెల 25న అర్హత, మౌఖిక పరీక్షల ద్వారా ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

మద్యానికి బానిసై ఒకరు బలవన్మరణం

ఖానాపూర్: మద్యానికి బానిసై ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపిన వివరాల మేరకు జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం వీవీరావుపేటకు చెందిన మండ్ల శ్రీనివాస్ గల్ఫ్ నుంచి వచ్చి కొన్నేళ్లుగా ఖానాపూర్ మండలంలోని పాత ఎల్లాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులకు తోడు మద్యానికి బానిసయ్యాడు. బుధవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య రజిత, కుమార్తెలు శ్రీనిధి, శ్రీహిత ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆత్మహత్యకు కారణమైన ఆరుగురి అరెస్ట్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఒకరి ఆత్మహత్యకు కారణమైన ఆరుగురిని గురువారం అరెస్టు చేసినట్లు ఎస్సై స్వరూప్‌రాజ్ తెలిపారు. జన్నారం మండలం తిమ్మాపూర్‌కు చెందిన గుండ సునీత, భూమయ్య ఉపాధి నిమిత్తం హాజీపూర్‌లో నివాసం ఉంటున్నారు. ముల్కల్లలోని సమీప బంధువులు సునీత తమను ఆర్థికంగా మోసం చేసిందని మానసికంగా వేధించి ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించారు. భూమయ్య ఫిర్యాదు సుద్దాల రాజేశ్వరి, సుద్దాల సుమన్, దామెర జయకుమార్, దామెర సురేందర్, సుద్దాల మౌనిక, దండు వినోద్‌కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య

బెజ్జూర్: ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సర్తాజ్‌పాషా తెలిపిన వివరాల మేరకు మండలంలోని కొత్తగూడ గ్రామానికి చెందిన లెండుగూరి భీంరావు (55)భార్య విమల ఆరేళ్ల క్రితం మృతి చెందింది. అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. గురువారం మద్యం మత్తులో తన పత్తి చేనులో చెట్టుకు ఉరేసుకున్నాడు. అటుగా వెళ్లిన రైతులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుని కుమారుడు అశ్విక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

బోథ్ కళాశాల ప్రిన్సిపాల్‌పై కేసు

ఆదిలాబాద్‌టౌన్: బోథ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కోవ విఠల్‌పై వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఆదిలాబాద్‌కు చెందిన తబస్సు ఖానమ్‌కు ఉద్యోగం ఇప్పిస్తానని రూ.లక్ష తీసుకున్నారని పేర్కొన్నారు. అనంత సొల్యూషన్ ఔట్‌సోర్సింగ్ ద్వారా గతేదాది ప్రభుత్వ పాఠశాల బాలక్ మందిర్‌లో కాంట్రాక్ట్ టీచర్‌గా ఉద్యోగం కల్పించినట్లు తెలిపారు. ఏడు నెలల పాటు ఉద్యోగం చేయగా, కేవలం ఒక నెలకు సంబంధించి రూ.16వేల వేతనం చెల్లించినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. ఆరు నెలల వేతనం ఇవ్వకపోవడంతో విధులు మానేసినట్లు తెలిపారు. ఈ విషయమై తనను మోసం చేసినట్లు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

డయల్ 100 సేవలు దుర్వినియోగపర్చిన ఒకరిపై..

నిర్మల్: అత్యవసర సమయంలో ఉపయోగించాల్సిన డయల్ 100 సేవలను మద్యం మత్తులో దుర్వినియోగపరిచిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. నర్సాపూర్ (జి) మండల కేంద్రంలో బుధవారం రాత్రి కానిస్టేబుల్ చౌహాన్ కృష్ణ, మోహన్ పెట్రో కార్ విధులు నిర్వహిస్తుండగా మండల కేంద్రానికి చెందిన తక్కల మహేష్ మద్యం మత్తులో డయల్ 100కు పలుమార్లు ఫోన్ చేసి న్యూసెన్స్ చేశాడు. దీంతో మహేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కడెం: మండలంలోని కొండుకూర్‌లో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని నవబ్‌పేట్‌కు చెందిన జక్కుల శ్రీనివాస్ బైక్‌పై కడెం నుంచి నవాబ్‌పేట్‌కు వెళ్తుండగా మార్గమధ్యలో కొండుకూర్ వద్ద ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రుడిని ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సారంగపల్లిలో చోరీ

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని సారంగపల్లిలో ఆసంపల్లి స్వామి ఇంట్లో చోరీ జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు స్వామి పది రోజులక్రితం ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి ఊరెళ్లాడు. బుధవారం ఇంటికి వచ్చిచూడగా తాళం తీసి ఉంది. వెంటనే లోనికి వెళ్లి బీరువాను తెరిచి చూడగా అందులో దాచి ఉంచిన రూ.22 వేల నగదు కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని గుర్తించిన బాధితుడు గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

అంతర్రాష్ట్ర బైక్ దొంగల ముఠా అరెస్ట్



బైక్‌లను పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

జైనథ్ : అంతర్రాష్ట్ర బైక్ దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బేల మండలానికి చెందిన సుమిత్, అతని మిత్రుడైన సలీం షకీల్‌తో కలసి మహారాష్ట్రకు చెందిన కృష్ణతో గ్యాంగ్‌గా ఏర్పడ్డారన్నారు. ఆదిలాబాద్ వన్ టౌన్, బేల, మహారాష్ట్ర కోర్పణ మండలాల్లో బైక్‌లను అపహరించి ఇతరులకు విక్రయిస్తుండేవారన్నారు. వారి వద్దనుంచి 12 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇందులో ఎనిమిదిమందిపై కేసు నమోదు చేసి నలుగురిని రిమాండ్‌కు తరలించామన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన రేషన్ బియ్యంతో ఎస్సై రాజేందర్

కోటపల్లి: మంచిర్యాల నుంచి మహారాష్ట్రకు బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 33 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. కోటపల్లి మండలంలోని రాంపూర్ సమీపంలో జాతీయ రహదారిపై గురువారం తనిఖీలు నిర్వహిస్తుండగా పట్టుబడినట్లు ఆయన పేర్కొన్నారు. డ్రైవర్ సంజయ్‌ను అదుపులోకి తీసుకుని సివిల్ సప్లై అధికారులకు సమాచారం అందించమన్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.


రెండోలీగ్‌లో ఓడిన ఉమ్మడి జిల్లా జట్టు



సాయికుమార్

మంచిర్యాలటౌన్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీఎ స్పార్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో రెండో లీగ్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు సాయి సత్య టీంతో 90 ఓవర్ల చాంపియన్‌షిప్‌లో ఓడిపోయింది. ఆదిలాబాద్ జట్టు మొదట బ్యాటింగ్ చేసి 30.3 ఓవర్లలో 93 పరుగులకు ఆలౌట్ కాగా అనంతరం బ్యాటింగ్ చేసిన సాయిసత్య టీం 24.3 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 96 పరుగులు చేసి విజయం సాధించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టులోని సాయికుమార్ 7 వికెట్లు సాధించడం గమనార్హం. పిచ్ పూర్తిగా బౌలర్లకు అనుకూలంగా ఉండడంతో, ఇరు జట్లు పరుగులను చేసేందుకు ఇబ్బంది పడ్డాయని కోచ్ ప్రదీప్ తెలిపారు.

దివ్యాంగులకు రైలులో రాయితీపై ప్రయాణం



మాట్లాడుతున్న ఐఎస్ఆర్ మూర్తి

మంచిర్యాలఅర్బన్: దివ్యాంగులు, ప్రత్యేక అవసరాలు కలిగిన వారికి రైల్వేశాఖ రాయితీపై ప్రయాణ సౌకర్యం కల్పిస్తోందని సికింద్రాబాద్ డివిజన్ (ఎస్‌సీఆర్) అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ ఐఎస్ఆర్ మూర్తి అన్నారు. గురువారం మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో అవగాహన కల్పించారు. మంచిర్యాల కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్‌టౌన్: షట్టర్ లిఫ్టింగ్ చేస్తూ చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ జానకీ షర్మిల తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీస్ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని ఉమ్రికి చెందిన రాజుసింగ్ మోహన్‌సింగ్, సేవక్ సింగ్ రఘుబీర్‌సింగ్, సుర్దీప్ సింగ్ ముగ్గురు బంధువులు. నిర్మల్ జిల్లాలో కూలి పనులు చేసేవారు. జల్సాలకు అలవాటుపడి సులభంగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 12న రాత్రి బైక్‌పై లక్ష్మణచాంద మండలంలోని కనకాపూర్ చేరుకుని పెట్రోల్ బంక్ సమీపంలోని ఇంటి ముందున్న బైక్‌ను దొంగలించారు. అనంతరం ఓ గోల్డ్‌షాప్‌లో చొరబడి బంగారం, వెండి ఆభరణాలు అపహరించారు. అదే రాత్రి ఉమ్రికి వెళ్తూ మార్గమధ్యలో కుంటాల మండలం కల్లూరు బస్టాండు సమీపంలో రెండు దుకాణాల తాళాలు పగులగొట్టి రూ.2,500ల నగదు అపహరించారు. గురువారం నిర్మల్‌లో బంగారం విక్రయించడానికి వచ్చారన్న పక్కా సమాచారంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. 2.7 కిలోల వెండి, 17 గ్రాముల బంగారం, రూ.2,500 నగదు, రెండు బైకులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు వెండి ఆభరణాలను 'నిర్మల్ పోలీస్' అని అందంగా అలంకరించి, తప్పించుకోలేరని ఒక మెసేజ్ ఇచ్చారు. కేసును ఛేదించడంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సీఐ గోవర్ధన్ రెడ్డి, ఎస్సైలు శ్రీనివాస్, అశోక్, పీసీఆర్ ఎస్సై ప్రదీప్ కుమార్, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

ఇచ్చోడలో దొంగల బీభత్సం

- ఒకేరోజు మూడిళ్లలో చోరీ
- బంగారం, వెండి, నగదు అపహరణ



ఇంటి తాళం పగులకొట్టిన దృశ్యం

ఇచ్చోడ: మండల కేంద్రంలో బుధవారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం వేసిన మూడిళ్లలో చోరీకి పాల్పడ్డారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీకి చెందిన జాదవ్ దేవిదాస్ మూడు రోజుల క్రిత్రం ఆత్మహత్యకు పాల్పడగా కుటుంబ సభ్యులంతా ఇంటికి తాళం వేసి సొనాల మండలంలోని ఘన్‌పూర్‌కు వెళ్లారు. తాళం పగులగొట్టిన దొంగలు ఇంట్లో చొరబడి తులం బంగారం, 20 తులాల వెండి, రూ.10 వేల నగదు దొంగిలించారు. విద్యానగర్ కాలనీలోని రమేశ్ ఇంట్లో చొరబడి 4 గ్రాముల బంగారంతో పాటు నగదు అపహరించారు. అదేకాలనీలో ఉన్న చిత్రం జంగు ఇంట్లో తులం బంగారం, ఐదు తులాల వెండి దొంగిలించారు. సంతోషిమాత ఆలయం వద్ద పార్క్ చేసిన పల్సర్ 220 బైక్‌ను తీసుకెళ్లి ఆదిలాబాద్ బైపాస్ వద్ద వదిలేసి పరారయ్యారు. అప్రమత్తమైన పోలీసులు క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్ బృందాలను రప్పించి వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు.

'ఉమ్మడి జిల్లా బంద్‌కు సహకరించాలి'



మాట్లాడుతున్న వెట్టి మనోజ్

ఆదిలాబాద్: జీవో 49 రద్దు చేయాలని కోరుతూ ఈనెల 21న చేపట్టనున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బంద్‌కు సహకరించాలని తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్ కోరారు. జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివాసీల హక్కులకు భంగం కలిగించే విధంగా ఉన్న జీవోను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆదివాసీలు, ప్రజాస్వామ్యవాదులు, గ్రామ పటేళ్లు, రాయి సెంటర్ సార్‌మేడీలు, ఆదివాసీ కుల సంఘాలు, వ్యాపార, వాణిజ్య, విద్యాసంస్థలు, ప్రజా సంఘాలు బంద్‌కు స్వచ్ఛందంగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘం డివిజన్ ఉపాధ్యక్షుడు ఆత్రం గణపతి, నాయకులు వెడ్మ బొజ్జు, ముకుందరావు, పీ. నాగోరావు, గెడం ఆనందరావు, దుర్వ జుగాధిరావు, ఆత్రం మచ్చేందర్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత



ల్యాప్‌టాప్ అందజేస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: కెరమెరి మండలంలోని నిషాని గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థి ఆత్రం వంశీకృష్ణ పైచదువుల నిమిత్తం గురువారం ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా తన కార్యాలయంలో ల్యాప్‌టాప్ అందజేశారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివితే భవిష్యత్‌లో అపజయాలు ఉండవని, ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు.

సన్మానం

కళామందిర్ ఫౌండేషన్ ద్వారా ఇటీవల సేవారత్న పురస్కారం అందుకున్న కాత్లే మారుతిని గురువారం ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సన్మానించారు. ఆదిలాబాద్ మండలం చించుఘాట్ గ్రామానికి చెందిన మారుతి ఎంతోమంది గిరిజన విద్యార్థులకు విలువిద్యలో శిక్షణ ఇచ్చినట్లు ఆమె పేర్కొన్నారు. ఫౌండేషన్ తరఫున అతనికి రూ.లక్ష నగదు, జ్ఞాపిక అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో పీవీటీజీ మెస్రం మనోహర్, ఏసీఎంవో జగన్, జిల్లా క్రీడల అధికారి పార్థసారథి పాల్గొన్నారు.

చెరువులో పడి బాలుడు మృతి



అశ్విత్ (ఫైల్)

దిలావర్‌పూర్: ప్రమాదవశాత్తు చెరువులో పడి బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన కొప్పుల అశ్విత్ (15) బుధవారం సాయంత్రం ఆడుకోవడానికి ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. రాత్రయినా రాకపోవడంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం మండల కేంద్రంలోని కుడి చెరువులో మృతదేహం గమనించిన స్థానికులు పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కాలకృత్యాల కోసం వెళ్లి చెరువులో జారిపడి మృతి చెందినట్లు అశ్విత్ తల్లి కొప్పుల పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

గడ్డెన్నవాగు ప్రాజెక్టులో పడి ఒకరి మృతి

భైంసాటౌన్: పట్టణ శివారులోని గడ్డెన్నవాగు ప్రాజెక్టులో పడి ఒకరు మృతి చెందినట్లు ఎస్సై నవనీత్ రెడ్డి తెలిపారు. మండలంలోని వానల్‌పాడ్‌కు చెందిన సిద్ధివార్ రమణ (45) పట్టణంలోని కోర్వగల్లిలో నివాసముంటున్నాడు. కుమారుడు రాజుతో కలిసి ఉదయం స్థానిక గడ్డెన్నవాగు ప్రాజెక్టులో చేపల వేటకు వెళ్లగా ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని వెలికి తీయించి పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

నిర్మల్‌లో కిడ్నాప్ కలకలం

నిర్మల్‌టౌన్: నిర్మల్‌లో బాలుడి కిడ్నాప్‌కు యత్నం కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు నిర్మల్ మండలం అనంతపేట్‌కు చెందిన ఐదేళ్ల బాలుడికి తండ్రి కిరాణా కొట్టువద్ద బిస్కెట్ ప్యాకెట్ కొనిచ్చి ఇంటికి వెళ్లమని చెప్పాడు. అదే గ్రామానికి వెంట్రుకలు కొనుగోలు చేయడానికి ఆటోలో వచ్చిన ఆరుగురు మహిళలు బాలున్ని ఆటోలో ఎక్కించుకుని వెళ్లారు. బాలుడు ఇంటికి రాకపోయేసరికి కంగారుపడిన తల్లిదండ్రులు అనుమానంతో బంగల్ పేట్ మహాలక్ష్మి వద్ద ఉన్న తెలిసిన వారికి ఫోన్ చేసి విషయం తెలిపారు. అప్పటికే ఆ మహిళలు మహాలక్ష్మి కాలనీకి కొద్ది దూరంలో బాలుడిని దించి వెళ్తుండగా పట్టుకుని నిలదీశారు. తమకేం తెలియదని బుకాయించడంతో వారిపై దాడి చేశారు. అనంతరం మహిళలను పోలీసులకు అప్పగించారు.


పిచ్చికుక్క స్వైరవిహారం



ఆస్పత్రి ఎదుట క్షతగాత్రులు

వేమనపల్లి: మండలంలోని జక్కెపల్లిలో గురువారం ఉదయం పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. ఏడుగురిపై దాడి చేసి గాయపర్చింది. అల్లాడి అనసూర్య ఎడమచేయి మణికట్టు వద్ద, ఆలం సాంబయ్య కాళ్లకు, చెన్నూరి బక్కు తల వద్ద, శనిగారపు పోశం కాళ్లకు, తలండి శ్రీనివాస్ చేతులను కొరికింది. చెన్నూరి శేఖర్‌పై పడి కొరికేందుకు ప్రయత్నించగా కర్రతో కొట్టి చంపాడు. జిల్లెడలో కూడా మరో నలుగురిపై దాడి చేసినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. క్షతగాత్రులను ఆటో సాయంతో వేమనపల్లి పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు.

కుక్క దాడిలో ఇరువురికి గాయాలు



గాయపడిన మహిళ

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో కాపువాడకు చెందిన కర్ల కళావతిపై కుక్క దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి కుక్కలను తరిమేయడంతో ప్రాణాపాయం తప్పింది. రైల్వే స్టేషన్‌కు వెళ్లే మరో ప్రయాణికునిపై కూడా కుక్క దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. బాధితులను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రైల్వే స్టేషన్‌లో కుక్కల బెడద ఉందని 'సాక్షి' బుధవారమే కథనాన్ని ప్రచురించింది. అయినా అధికారులు స్పందించక పోవడంతో ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైల్వే స్టేషన్ పరిసరాల్లో కుక్కల బెడదను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.